వినూత్న పద్ధతుల్లో బోధించాలి..

- జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి
- రావిరాల పాఠశాలలో అకస్మిక తనిఖీ

నెల్లికుదురు, ఫిబ్రవరి 24 ః వినూత్న పద్ధతుల్లో బోధనతో విషయ అవగాహన కండ్లకు కట్టినట్టుగా ఉండి విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రావిరాల ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి రాందాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన విద్యార్థులకు అందించాలని, భోజనం తయారు చేసేటప్పుడు శుభ్రత పాటించాలని వంట కార్మికులకు చూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో నిర్వమించిన సమీక్షలో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎఫ్‌ఏవో, తొర్రూరు ఎంఈవో బుచ్చయ్య, నెల్లికుదురు ఎంఈవో రాందాస్, పాఠశాల హెచ్‌ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం శాతం ఉత్తీర్ణత సాధించాలి..

తొర్రూరు, ఫిబ్రవరి 24 : తొర్రూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ టెస్ట్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పరీక్ష తీరును పరిశీలించి, హాజరు శాతాన్ని పెంచేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బుచ్చయ్య, హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయులు జిల్లా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ వలలో మోసపోయిన వ్యాపారి

మహబూబాబాద్ రూరల్ : సైబర్ వలలో చిక్కి ఓ వ్యాపారి మోసపోయిన ఘటన పట్టణంలో సోమవారం జరిగింది. టౌన్ సీఐ కథనం ప్రకారం.. ఆర్టీసీ కాలనీకి చెందిన సోమ సంపత్ దుకాణానికి ఈ నెల 18న ఓ వ్యక్తి వచ్చి తన సెల్‌ఫోన్ తీసుకొని ఫోన్ చేసుకున్నాడు. కొద్ది సేపటికే అకౌంట్‌లో నుంచి రూ.75,600 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయినట్లు గమనించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

చిన్నగూడూరు ఫిబ్రవరి 24 : బాలికలు చదువుల్లో పోటీతత్వం అలవర్చుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థితికి చేరుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని జయ్యారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఆడపిల్లల సాధికారత' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలతో ఆడపిల్లలు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింహులపేట ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

జీపీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

నర్సింహులపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని గోల్ బోక్కతండా జీపీ పరిధిలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బాదావత్ సరోజ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో 31 మంది మరుగుదొడ్లు నిర్మించుకోగా, వారికి రావాల్సిన బిల్లులను పంచాయతీ కార్యదర్శి తన సొంత ఖాతాలో జమ చేసుకొని నగదు కాజేశారని అన్నారు. లబ్ధిదారుడికి రూ.12వేల చొప్పున 31మందికి సంబంధించి రూ.3,72,000 స్వాహ చేశారని ఆరోపించారు. సర్పంచ్‌తో పాటు 31 మంది లబ్ధిదారుల సంతకాలను తానే చేసి నిధులు తీసుకున్నట్లు తెలిపారు. బృహత్ పల్లె ప్రకృతి వనానికి ఇవ్వాల్సిన డబ్బులు సుమారు రూ.2లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యుడైన కార్యదర్శిపై చర్యలు తీసుకొని, బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో యాకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్య తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్, వెంకన్న భద్రి, జీపీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నర్సింహులపేట : పెద్దనాగారం వద్ద అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ ఎంపీ కవిత

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

నర్సింహులపేట, ఫిబ్రవరి 24: దంతాలపల్లి మండలంలో కేసీఆర్ జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దంతాలపల్లి మీదుగా నర్సింహులపేట మండలకేంద్రానికి వచ్చారు. ఈ మేరకు పెద్దనాగారం స్టేజీ వద్ద సోమవారం మహిళలు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు మంగళహారతులు, పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మరిపెడ మండలం చిల్లంచర్లకు వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, డీఎస్ రవిచంద్ర, నాయకులు రవీందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, లక్ష్మి, వంశీ, వీరస్వామి, లింగ్యా ఉన్నారు. మండలంలోని పెద్దనాగారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చలమల్ల నరేశ్ ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సమయంలో తనకు ఆర్థికంగా సహకరించారని నరేశ్ తెలిపారు. పార్టీలు వేరు, వ్యక్తులు వేరని, కవిత అంటే అభిమానమని చెప్పారు.

మరిపెడలో..

మరిపెడ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరిపెడలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. సోమవారం జిల్లాలో ఒక రోజు పర్యటనలో భాగంగా డోర్నకల్ నియోజకవర్గంలోని దంతాలపల్లి, మరిపెడ, కురవి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మరిపెడలో కవితకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్త లు గాంధీ సెంటర్‌లో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. పటాకులు పేల్చి పెద్దఎత్తున నినాదలు చేశారు. స్వాగతం పలికిన వారిలో గ్రంథాలయ సంస్థ మా జీ చైర్మన్ నవీన్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రవిచంద్ర, మండల నాయకులు మాజీ ఎంపీపీలు గుగులోత్ వెంకన్న, గుగులోత్ అరుణారాంబాబు, మాజీ సర్పంచ్ ఫో రం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ శారదారవీందర్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత వెంట ఎమ్మెల్సీలు సత్యవతి రాథో డ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రవిచంద్ర, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ జెడ్పీచైర్పర్సన్ బిందు, మాజీ కో ఆప్షన్ మెంబర్ అయుబ్ పాషా ఉన్నారు. కాగా మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో జాగృతి నాయకురాలు మారిపల్లి మాధవి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అడుగడుగునా ఆశీర్వాదాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : అడుగడుగునా ఆశీర్వాదాలే. ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని పూలే విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన విభాగం నాయకుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో భారీగా కార్యకర్తలతో తరలివచ్చి ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి మార్కె ట్ యార్డ్ వరకు ప్రజలు రోడ్డుపైన ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు తరలివచ్చారు. దారి వెంబడి అనేక మంది మహిళలు, స్థానిక ప్రజలు తాగునీరు, సాగునీరు వంటి సమ స్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ బిందు కవితకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని రంజిత్, లునావత్ అశోక్ నాయక్, మహబూబ్ పాషా, వెంకన్న వివిధ మండలాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

కురవి, ఫిబ్రవరి 24: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కురవి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. మాజీ జడ్పీటీసీ కొంతం కవిత, కాంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, పద్మ, అమ్రీ బాయ్, లక్ష్మీ, రాజూనాయక్ తదితరులు మంగళహారతితో స్వాగతం పలికారు. నేరడ క్రాస్ రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. చెంచు, గిరిజన, కోలాటం నృత్య కళాకారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకాగా, ర్యాలీగా వీరభద్రస్వామి ఆలయ దర్శనానికి బయలుదేరారు.

ఎమ్మెల్సీ కవితకు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీపూల దండతో స్వాగతం

స్వామివారికి ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం వారిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎంపీ జిల్లా, బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ రవిచంద్ర, జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు రవి, జాగృతి రాష్ట్ర నాయకులు సంగెం హర్షిత్ కుమార్, నూతక్కి నరసింహారావు, యతిరాజ్, కురవి మాజీ ఉప సర్పంచ్‌లు సంగెం భరత్, రమాదేవి, రాజు నాయక్, వీరన్న పాల్గొన్నారు.

చుక్క శ్రీనుకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : మానుకోట పట్టణానికి చెందిన గాయకుడు చుక్క శ్రీను కుమారుడు శ్రీచరణ్ ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వల్లబు వెంకటేశ్వర్లు, ఆకుల శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : కురవి వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 26న జరిగే జాతరకు మానుకోట నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక బస్సు సౌకర్యం ఉంటుందని, పెద్దలకు టికెట్ ధర రూ.30, పిల్లలకు రూ.20 ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కిరాయి వాహనాలతో నిత్యం పర్యవేక్షణ చేస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా సీనియర్ జర్నలిస్ట్ మట్టూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యవేక్షణ చేసే వాహనాలకు టెండర్ ప్రాసెస్‌లో నోటిఫికేషన్ ఇచ్చి, అనుమతి ద్వారా మాత్రమే నడపాలన్నారు. కానీ, డీఎంహెచ్‌వోలో ప్రోగ్రాం ఆఫీసర్లు, ఆర్‌బీఎస్‌కే, టీ హబ్ శాంపిల్స్‌కు ఉపయోగించే అన్ని వాహనాలకు టెండర్ ప్రక్రియ నిర్వహించకుండా సొంత వాహనాలను వినియోగిస్తున్నారని, వెంటనే పూర్తి విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిర్చి పంటను ప్రభుత్వమే కొనాలి

కురవి, ఫిబ్రవరి 24 : మిర్చి పంటను ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో కొనాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి మిరప పంట పండించిన రైతులు తగ్గిన ధరతో దిగాలుపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా క్వింటాలు మిర్చికి రూ.20 వేల నుంచి రూ.25వేలకు కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్, కన్నె వెంకన్న, బుర్ర సమ్మయ్య పాల్గొన్నారు.

పుల్లూరులో పశు వైద్య శిబిరం

గార్ల, ఫిబ్రవరి 24: పశు గణాభివృద్ధి సంస్థ వైరా, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. గర్భ కోశ వ్యాధుల నివారణకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ వీర్యం ద్వారా మేలైన ఆడ దూడలు పొందవచ్చన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ పశు వైద్యాధికారి నాగేశ్వరరావు , డాక్టర్ సురేశ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

జామతండాలో స్వయం పాలన

నెల్లికుదురు, ఫిబ్రవరి 24 : మండలంలోని జామతండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనూష ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతరలో వైద్యసేవలపై సన్నాహక సమావేశం

కురవి , ఫిబ్రవరి 24 : మహాశివరాత్రిని పురస్కరించుకొని కురవి జాతరలో వై ద్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మురళీధర్ ఆదేశాల మేరకు సో మవారం వైద్యాధికారులు, సి బ్బందితో ప్రోగ్రాం అధికారులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రా మ్ అధికారులు సుధీర్‌రెడ్డి, నాగేశ్వరరావు, సారంగం, విజ య్, శ్రవణ్ మాట్లాడుతూ... జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పక్షాన నాలుగు ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక టీం, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మరో టీం రెండు విడుతలుగా 64 మంది విధులు నిర్వర్తిస్తారి తెలిపారు. పర్యవేక్షణ కోసం ప్రోగ్రాం అధికారులను క్యాంప్ ఇన్‌చార్జి ఆఫీసర్లుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వీరాజిత, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సీహెచ్‌వో శ్రీహరి, ఎంపీహెచ్‌ఈవో గౌస్ పాల్గొన్నారు.

వేసవిలో కరెంట్ కష్టాలు తీర్చడమే లక్ష్యం

పెద్దవంగర, ఫిబ్రవరి 24 : వేసవిలో కరెంటు కష్టాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన కరెంటు అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏఈ రమేశ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మకల్లు, పోచంపల్లి గ్రామ శివారుల్లోని తండాల్లో నూతన ట్రాన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి మాట్లాడారు. గిరిజన ఆవాస ప్రాంతాలతోపాటు గ్రామాల్లో రానున్న వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక ప్రణాళికను తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

డోర్నకల్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని బిగ్ హెల్ప్ ఇండియా చైర్మన్ బండి నరసింహారావు అన్నారు. సోమవారం డోర్నకల్ జడ్పీహెచ్‌ఎస్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా బిగ్ హెల్ప్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి డోర్నకల్ జడ్పీహెచ్‌ఎస్, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్‌ఎస్ కన్నెగుండ్ల , తృతీయ బహుమతి కేజీబీవీ పాఠశాల, రాజు తండా గెలుపొందాయి. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంగోత్ లక్ష్మా, బిగ్ హెల్ప్ ఇండియా చైర్మన్ నరసింహారావు, డైరెక్టర్ బిచ్చు, మండల కన్వీనర్ రాజేశ్వర్, మండల సెక్రటరీ శంకర్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, మంజులత, వసంత రాణి, కమల పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు: నలుగురికి గాయాలు

డోర్నకల్, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చాప్లతండా సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. డోర్నకల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, మాజీ జడ్పీటీసీ గొర్ల సత్తిరెడ్డి, సీపీఎం నాయకులు జేవీఆర్, ఎర్ర శ్రీను మహబూబాబాద్ నుంచి ఇంటికి వస్తుండగా, చాప్లతండా సమీపంలో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

మానవత్వం చాటుకున్న ఎల్లయ్య

నెల్లికుదురు, ఫిబ్రవరి 24 : మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్, ప్రస్తుతం ఆటో స్టాండ్ వద్ద డ్యూటీ చేస్తున్న ఆకారపు చారి నిరుపేద. ఆయన దుస్తులు చిరిగి ఉండడాన్ని గమనించిన అమ్మ ప్రేమ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య అతడికి నూతన దుస్తులు కొనిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు హెచ్ వెంకన్న, ఎండీ అక్బర్‌పాష, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు సగం వాటా దక్కాలి

బయ్యారం, ఫిబ్రవరి 24 : రాజ్యాంగబద్ధంగా బీసీలకు సగం దక్కాలని సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఉద్యమాల ఉపాధ్యాయుడిగా అందరికీ సుపరిచితుడైన సాంబశివరావు 78వ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీసీ మ్యానిఫెస్టో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుట్టయ్య, వినయ్ బాబు, రమేశ్‌గౌడ్, భిక్షపతి, సురేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వెంకన్న(ఫైల్)

దంతాలపల్లి, ఫిబ్రవరి 24: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన మట్టపల్లి వెంకన్న (55) ఇటీవల గ్రామంలో అప్పు తెచ్చి సొంత ఇల్లు నిర్మించుకున్నాడు. దీనికి తోడు కుమారుడి చదువుకు కొంత అప్పు కావడంతో తీర్చే స్తోమత లేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకోగా గమనించిన స్థానికులు సూర్యపేట ఏరియావైద్యశాలకు తరలించారు. చికి త్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఉప్పలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

శైలజ (ఫైల్)

నర్సింహులపేట, ఫిబ్రవరి 24 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వంతడపల స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. ముడిశెట్టి శైలజ(30) అనే మహిళ రాత్రి సమయంలో పిండి పట్టే మిల్లుకు దుమ్ము పడకుండా టార్పాలిన్ కవర్ కప్పే క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో శైలజ కింద పడిపోయింది. గమనించిన ఆమె తల్లి జయమ్మ కాపాడబోవడంతో ఆమెకు కూడా షాక్ రావడంతో వదిలించుకొని విద్యుత్ ఆఫ్ చేసే సరికే శైలజ మృతి చెందింది. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. శైలజకు కుమారుడు ఉన్నాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

నెల్లికుదురు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తొర్రూరు డీఎస్పీ

నెల్లికుదురు, ఫిబ్రవరి 24 : 27న జరిగే వరంగల్– ఖమ్మం– నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్రాన్ని తొర్రూరు సీఐ గణేశ్, ఎస్సై చిర్ర రమేశ్‌బాబుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండలంలో 45మంది ఓట ర్లు ఉన్నారని, ఈ నెల 27న ఉదయం 8 గంటల నుం చి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనున్న ట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు, ఎంపీడీవో బాలరాజు, సీఐ గణేశ్, ఎస్సై రమేశ్‌బాబు పాల్గొన్నారు.

తొర్రూరులో..

తొర్రూర్, ఫిబ్రవరి 24: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తొర్రూర్ డివిజన్‌లోని వివిధ పోలింగ్ కేంద్రాలను తొర్రూరు డీఎస్పీ కే కృష్ణ కిశోర్, సీఐ గణేశ్, ఎస్ఐ ఉపేందర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రహదారి పనులు పూర్తి చేయాలని ఎన్డీ ధర్నా

బయ్యారం, ఫిబ్రవరి 24: అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎన్డీ నాయకులు సోమవారం వెంకట్రాంపురం రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బయ్యారం నుంచి వెంకట్రాంపురం మీదుగా వట్టేవాగు బ్రిడ్జి వరకు అసంపూర్తిగా ఉన్న రహదారితో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్య వల్ల సుమారు 20 గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నా సంబంధింత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే బీటీ రోడ్డును పూర్తి చేయాలని, లేకపోతే జిల్లా ఇంజినీరింగ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకన్న, రామగిరి భిక్షం, తుడుం వీరభద్రం, నేతకాని రాకేశ్, రామచంద్రుల మురళి, ఏపూరి వీరభద్రం, నాగేశ్వరరావు, బండి ప్రభాకర్, రమేశ్, సోమక్క, ఉపేందర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని ధర్నా

డోర్నకల్, ఫిబ్రవరి 24 : తల్లి ఉష చిన్నారులకు ఎందుకు మందు పోసిందో సమాధానం చెప్పాలని జోగ్యతండా వద్ద నిత్యశ్రీ(5) కుటుంబ సభ్యులు, బంధువులు, తండా ప్రజలు రోడ్డుపై ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు నిత్యశ్రీ మృతదేహంతో ధర్నా నిర్వహించారు. తల్లి ఉష వచ్చి అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులతో కుటుంబ సభ్యులు, బంధువులు, తండా ప్రజలు వాదనకు దిగారు. వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తి చెప్పడం వల్లే చిన్నారులకు మందు పోసిందని, అతడిని కూడా కఠినంగా శిక్షించాలన్నారు. డోర్నకల్ సీఐ భూక్యా రాజేశ్ , గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ధర్నా చేస్తున్న వారికి నచ్చజెప్పి, హామీ ఇవ్వడంతో ఉదయం 10 గంటలకు ధర్నా విరమించారు. అనంతరం నిత్య శ్రీ అంత్యక్రియలు నిర్వహించారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధం

మరిపెడ, ఫిబ్రవరి 24 : పురపాలక సంఘం పరిధిలోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను నిషేధించినట్లు హెల్త్ అసిస్టెంట్ వీరన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే హోల్‌సేల్, రిటైల్ షాపుల యజమానులకు పలుమార్లు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై సమాచారమిచ్చామని, ఇప్పటి నుంచి ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, ఇచ్చినా కఠిన చర్యలతోపాటు పెద్ద ఎత్తున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే షాపులకు రూ. 5వేల వరకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్స్ అన్సారి, రాములు, శ్రీకాంత్, వెంకట్‌లాల్, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నర్సింహులపేట/చిన్నగూడూరు/ పెద్దవంగర, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్నగూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దవంగర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిశోర్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 24: అనుమానం ఉన్న ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో టీబీ పరీక్షలు నిర్వహించగా ఆయన పరిశీలించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తుల నుంచి తెమడ సేకరించి పరీక్షలు చేయాలన్నారు. పాజిటివ్ వచ్చిన కేసులకు ప్రభుత్వం నుంచి ఆరు నెలల మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. భారతదేశంలో క్షయవ్యాధి లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు

లైబ్రరీ డివైస్ రూపకల్పనకు గౌరవం

తొర్రూరు, ఫిబ్రవరి 24 : ఏఐ సాంకేతికత ఆధారంగా లైబ్రరీ పుస్తకాలను వాయిస్ రూపంలో చదివే ప్రత్యేకమైన డివైస్‌ను రూపొందించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జీడీసీ) లైబ్రేరియన్ సాంబారి శ్రీనివాస్‌కు పేటెంట్ లభించింది. పోర్టబుల్ లైబ్రరీ మేనేజ్మెంట్ డివైస్‌ను అభివృద్ధి చేసినందుకు గాను భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం ఆయనకు అధికారిక పత్రాన్ని అందజేసింది. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బీ రాములు శ్రీనివాస్‌కు పేటెంట్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..లైబ్రరీ మేనేజ్మెంట్ డివైస్ రూపకల్పన గొప్ప ఆవిష్కరణ అని, దీని ద్వారా పుస్తకాలు చదవడం మరింత సులభం అవుతుందన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

నర్సింహులపేట, ఫిబ్రవరి 24: మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో పట్ట పగలు ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మెరుగు నర్సయ్య వ్యవసాయ పనుల కోసం వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న తులం బంగారం, 50 తులాల వెండితో పాటు రూ.28వేల నగదు అపహరించినట్లు తెలిపారు.

భగీరథ నీరు వృథా

బయ్యారం, ఫిబ్రవరి 24 : పైపులైన్ లీకేజీ కారణంగా భగీరథ నీరు వృథాగా పోతున్నది. మండలంలోని భీమ్లాతండా గ్రామంలో బీఎస్ఎన్‌ఎల్ కేబుల్ వేసేందుకు ఇటీవల గుత్తేదారు జేసీబీతో తవ్వకాలు జరపగా, భగీరథ పైపులైన్లు పగిలి నీరు వృథాగా పోతున్నది. దీంతో అటువైపు నివాసాలకు నీరు సరిపడా నీరు రాక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అసలే వేసవి కాలం.. నీరు దొరకక చాలా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతుంటే.., ఇక్కడ నీరు వృథా కావడం విమర్శలకు తావిస్తున్నది. అదేవిధంగా భీమ్లాతండా నుంచి లింగగిరి వరకు కేబుల్ కోసం తీసిన గుంతలు సరిగ్గా పూడ్చక ప్రమాదాలు జరుగుతున్నాయి.



భీమ్లాండాలో వృథా అవుతున్న భగీరథ నీరు